చికెన్ షాపులు వెలవెల.. వ్యాపారులు డీలా

- చికెన్ ధర ఢమాల్
- పలు దుకాణాలు తాత్కాలికంగా మూసివేత
- మంట పుట్టిస్తున్న మటన్ ధర
- చేప, రొయ్యలు, పీతల ధరలకు రెక్కలు



గణపవరంలో వారపుసంత రోజైన సోమవారం ఖాళీగా చికెన్ దుకాణం

గణపవరం: బర్డ్‌ఫ్లూ కలకలం రేగడంతో ఉంగుటూరు నియోజకవర్గంలో చికెన్ వ్యాపారం పూర్తిగా చతికిలపడిపోయింది. కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉండే చికెన్ దుకాణాలు కొనుగోలు చేసే నాథుడులేక ప్రస్తుతం వెలవెల బోతున్నాయి. కొన్ని చికెన్ దుకాణాలను మూసి వేశారు. మాంసాహారాన్ని ఉడికించి తింటే వైరస్ ప్రభావం ఏమాత్రం ఉండదని పశుసంవర్ధకశాఖ, వైద్యారోగ్యశాఖ చెబుతున్నా ప్రజలు పట్టించుకోవడంలేదు. కొన్ని రోజుల పాటు చికెన్, గుడ్డుకు దూరంగా ఉంటేనే మంచిదన్న అభిప్రాయంతో వినియోగదారులు ఉన్నారు.

స్తంభించిన చికెన్ కొనుగోళ్లు

సాధారణంగా వారాంతపు సెలవురోజు ఆదివారం చికెన్ విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. గణపవరంలో వారపుసంత జరిగే సోమవారం చికెన్ వ్యాపారం మామూలు రోజుల కంటే అధికంగా జరుగుతుంది. అయితే బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాపించడంతో నియోజకవర్గంలోని పలు పౌల్ట్రీ ఫారాల్లో లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా బర్డ్‌ఫ్లూ వ్యాధి కోళ్ల పెంపకందారులను దెబ్బ తీసింది. కళ్లముందే కోళ్లను బర్డ్‌ఫ్లూ కబళిస్తుంటే కోళ్ల రైతులు ఏమీ చేయలేక చేష్టలుడిగి చూస్తూ ఉండిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మిగిలిఉన్న కోళ్లనైనా విక్రయించి కొంతలో కొంత సొమ్ము చేసుకుని నష్టాల ఊబి నుంచి బయటపడదామంటే మార్కెట్‌లో చికెన్ కొనుగోళ్లు పూర్తిగా స్తంభించిపోయాయి.

లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత

బర్డ్‌ఫ్లూ వ్యాధి దెబ్బతో చికెన్ తినాలంటేనే ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. చికెన్ ధర సగానికి సగం తగ్గించి విక్రయిస్తున్నా వినియోగదారులు చికెన్ దుకాణాలవైపు కన్నెత్తి చూడటంలేదు. దీనితో చికెన్ దుకాణాల్లో ఉదయం వేలాడదీసిన కోళ్లు సాయంత్రం వరకూ అలానే ఉంటున్నాయి. ఇప్పటికే చాలామంది చికెన్ వ్యాపారులు తాత్కాలికంగా తమ దుకాణాలను మూసివేశారు. గణపవరం, నిడమర్రు మండలాల్లో హోల్‌సేల్, రిటైల్ చికెన్ దుకాణాలు దాదాపు 200 పైగానే ఉన్నాయి. గణపవరం మండలంలోని కేశవరం, ముప్పర్తిపాడు, మొయ్యేరు, కోమర్రు తదితర గ్రామాల్లో పదివరకూ కోళ్ల ఫారాలున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఉంగుటూరులోని కోళ్ల ఫారాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధి విజృంభించడంతో లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి.

చేపలు, మేక మాంసం దుకాణాల వద్ద రద్దీ

గణపవరం మండలంలో బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాపించినట్లు ఇంత వరకూ నిర్ధారణ కాలేదు. అయినా కోడి మాంసం తినడానికి జనం భయపడుతున్నారు. దీనితో అమ్మకాలు లేక చికెన్ దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వారం రోజుల క్రితం కిలో రూ.240 నుంచి రూ.250 పలికిన చికెన్ ధర ప్రస్తుతం సగానికి సగం అంటే కిలో రూ.120కి పడిపోయింది. అయినా చికెన్ దుకాణాల్లో బోణీ కావడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. ఇదే అదనుగా వేట మాంసం, చేప, రొయ్యలు, పీతల ధరలకు రెక్కలొచ్చాయి. మటన్‌కిలోరూ.700 నుంచి రూ.800కు విక్రయించేవారు. ప్రస్తుతం మటన్ ధర కిలోరూ.1000 నుంచి రూ.1100 చేరింది. చేప ధర కూడా కిలో రూ.130 నుంచి రూ.160కు పెరిగింది. ఎంత ధరైనా మాంసాహార ప్రియులు లెక్కచేయడంలేదు. మటన్, చేప దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఏటా సీజన్‌లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకడం సర్వ సాధారణమే అయినా ఈప్రాంతంలో ఇంతగా ఎప్పుడూ వ్యాధి తీవ్రత ఇంతగా లేదు. అందువల్ల చికెన్ అమ్మకాలు కొంతమేర తగ్గినా ఇంత గడ్డు పరిస్థితి ఉండేది కాదని ఫారాల యజమానులు అంటున్నారు. ఈ ఏడాది మాత్రం నియోజకవర్గంలో ఉంగుటూరు మండలంలో బర్డ్‌ఫ్లూ వ్యాధి విజృంభించడంతో ఈప్రాంత ప్రజలు చికెన్ కొనుగోలుకు ముందుకు రావడం లేదు. బర్డ్‌ఫ్లూ మనుషులకు సోకదని, బాగా ఉడకబెట్టిన చికెన్, గుడ్లు తినవచ్చునని వైద్యనిపుణులు చెబుతున్నా కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితి ఇంకా ఎంతకాలం ఉంటుందోనని చికెన్ వ్యాపారులు వాపోతున్నారు.

గుడ్డుదీ అదేదారి

బర్డ్‌ఫ్లూ దెబ్బ కోడిగుడ్లపై కూడా పడింది. షాపుల్లో కోడిగుడ్డు విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. రూ.7 ఉండే కోడి గుడ్డును రూ.4కే ఇస్తామన్నా కొనేవారు కనిపించడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. పలు దుకాణదారులు వారానికి సరిపడ కోడిగుడ్లు వేయించుకుని వాటిని విక్రయించలేక బయట పారవేసే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు కోడి గుడ్ల సరఫరా నిలిచిపోయింది.

విందు భోజనాల్లో చికెన్ మాయం

సాధారణంగా చాలా వేడుకల్లో వడ్డించే మాంసాహార వంటకాలలో చికెన్‌దే అగ్రస్థానం. చికెన్ కర్రీ, చికెన్ ఫ్రైలో ఏదో ఒకటి ఉండి తీరాల్సిందే. అయితే వారం రోజులుగా జరిగిన ఏ ఫంక్షన్‌లోనూ చికెన్ కూర మచ్చుకు కూడా కనిపించడం లేదు. హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లలో సైతం చికెన్ వినియోగం పూర్తిగా నిలిపివేయడంతో చికెన్ విక్రయాలు జరగడంలేదని వ్యాపారులు చెబుతున్నారు.

చికెన్ ధరలు ఇలా

	వారం క్రితం (కిలో)	ప్రస్తుతం (కిలో)
బ్రాయిలర్ లైవ్	రూ.120	రూ.80
ఫారం లైవ్	రూ.80	రూ.40
బ్రాయిలర్ చికెన్	రూ.300	రూ.150
ఫారం చికెన్	రూ.200	రూ.100

చికెన్, గుడ్లు బాగా ఉడికించి తినాలి



గణపవరం మండలంలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలు నమోదు కాలేదు. రెండు రోజులుగా మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, కోమర్రు, డికుముదవల్లి ప్రాంతాల్లో కోళ్ల ఫారాలను తనిఖీ చేశాం. పౌల్ట్రీ యజమానులకు పలు సూచనలుచేసి, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చాం. బర్డ్‌ఫ్లూ ఇంతవరకూ మనుషులకు సోకిన దాఖలాల్లేవు. చికెన్, గుడ్లు బాగా ఉడికించి తినడంవల్ల ఇబ్బంది ఉండదు.

– నాయక్, పశుసంవర్ధకశాఖ ఏడీ

అసత్య ప్రచారాలతోనే ఇబ్బంది



బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి అక్కడక్కడా మాత్రమే కనిపిస్తోంది. కాని ప్రచార మాధ్యమాలలో దీనిపై విస్తృతంగా ప్రచారం చేయడంతో కరోనా కంటే భయంకర వ్యాధిగా ప్రజల్లో అపోహలు వచ్చి, చికెన్‌కు పూర్తిగా దూరమయ్యారు. ఏటా వేసవికాలం ప్రవేశ సమయంలో బర్డ్‌ఫ్లూ అక్కడక్కడా కనిపిస్తుంది. మా షాపులో రోజూ రిటైల్‌గా నాలుగు నుంచి ఐదు వందల కోళ్లు విక్రయించేవాళ్లం. వారం రోజులుగా 30 నుంచి 40 కోళ్లు కూడా విక్రయించలేదు. ప్రభుత్వం చికెన్ వ్యాపారులను ఆదుకోవాలి.

– బందారు రంగా, హోల్‌సేల్ చికెన్ వ్యాపారి, గణపవరం

హామీలను విస్మరించిన కూటమి నాయకులు



భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



భీమడోలు ఇన్‌చార్జి పీవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

భీమడోలు: అంగన్‌వాడీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ధర్నా చేసారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు సంఘీభావం తెలిపారు. వివిధ మండలాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది కూటమి ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన ఆర్.లింగరాజు మాట్లాడారు. రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నేటికీ అమలు చేయడం లేదన్నారు. గతేడాది అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలపై సమ్మె చేయగా కూటమి నాయకులు శిబిరాలకు వచ్చి తాము అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, గద్దెనెక్కి 9 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేయాలని, కరెంట్, టీఏ బిల్లులు, అద్దెలు ఏన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు.అనంతరం ఇన్‌చార్జి పీవోకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు స్వర్ణకుమారి, ప్రాజెక్టు నాయకురాలు సుజాత, రత్నకుమారి, ఝాన్సీ, శాంతకుమారి, విజయకుమార్, వివిధ మండలాల కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

డైనింగ్ హాల్‌కు శంకుస్థాపన



డైనింగ్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం సోమవారం ప్రారంభమైంది. ఎంఈవో-2 పరసా వెంకటరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కూన రాంబాబు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భందా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన వడ్లపూడి నాగభూషణం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వడ్లమూడి శ్రీధర్ డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.11 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సొమ్ముతో డైనింగ్ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత బల్లా త్రిమూర్తులు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు షేక్ నాగూర్ మీరా సాహెబ్, రిటైర్డ్ బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కలిగట్ల శ్రీరామకృష్ణ, చేబ్రోలు సాయి బాబా గుడి కమిటీ మెంబర్ పొన్నం లక్ష్మీనారాయణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంధ్యారాణి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాదంపూడి కోళ్ల ఫారంలో సూపర్ శానిటేషన్ పూర్తి

ఉంగుటూరు: బాదంపూడిలో బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను చంపి, ఖననం చేసే ప్రక్రియ ముగిసింది. వెంకటమణికంఠ పౌల్ట్రీ ఫారంలో సోమవారంతో ఈ ప్రక్రియ ముగిసింది. 63వేల కోడిగుడ్లు, 1.10 లక్షల కోళ్లను చంపి, ఖననం చేశారు. ఈ ఫారంలో సూపర్ శానిటేషన్ పనులు పూర్తి చేశారు. ఫారంలో పని చేసిన 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పెద తాడేపల్లి పంచాయతీ పరిధిలో మరో ఫారంలో కోళ్లను చంపే ప్రక్రియ సోమవారం ప్రారంభించారు.ఆ ఫారంలో 30వేలు కోళ్లు ఉన్నట్లు సమాచారం. వైద్య సిబ్బంది కోళ్ల ఫారాల్లో కోళ్లను ఖననం చేసే ప్రక్రియలో పాల్గొన్నారు.

హంపి పీఠం సిద్ధాంతి కృష్ణ ప్రసాద్ శాస్త్రి మృతి



భీమడోలు: పోలసానిపల్లికి చెందిన జ్యోతిష్య కేసరి, హంపి పీఠం సిద్ధాంతి కాశీబొట్ల వీరవెంకటనాగేశ్వర కృష్ణప్రసాద్ శాస్త్రి(66) సోమవారం పరమ పదించారు. అనారోగ్యానికి గురైన ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆధ్యాత్మిక గురువుగా పేరొందిన ఆయన ఇక లేరన్న వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలములుకున్నాయి. ఆయన కర్ణాటక హంపీ విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం, ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి దేవస్థానం, జగద్గురు దత్తాత్రేయ స్వా మి మహా సంస్థాన పీఠం, శ్రీక్షేత్ర వల్లభాపురం పంచాంగకర్త, ఆస్థాన సిద్ధాంతి, జ్యోతిష్యకేసరి, సిద్ధాంత శిరోభూషణ వంటి పదవులను అధిరోహించి దైవచింతనతో దశాబ్దాలుగా సేవలందిస్తున్నారు. దేశవ్యాప్తంగా పలురాష్ట్రాల్లో ఆయన సేవలందించారు. ఆయన ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి భీమడోలు గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సంతాపం ప్రకటించింది.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో సమస్యలు పరిష్కరిస్తాం

దెందులూరు : కొవ్వలి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా రూ.16.25 లక్షలు మంజూరయ్యాయని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి రమేష్ అన్నారు. సోమవారం కొవ్వలి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూఓ రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌గా ఉన్న కొవ్వలి హాస్టల్ ఆధునీకరణకు రూ.16.25 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో హాస్టల్లో బాత్‌రూమ్ డోర్లు ఏర్పాటుకు, లైట్ల మరమ్మత్తులు తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కొద్ది రోజుల్లోనే అన్ని సమస్యలను పరిష్కరించి హాస్టల్ విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తామన్నారు. ఆధునీకరణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేయాలని ఏవో సత్యనారాయణకు సూచించారు. అభివృద్ధి పనులను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు గోల్డెన్ రాజు, భీముడు ఉన్నారు.

వీఆర్వోల సమస్యలపై స్పందించాలి



పెదపాడు మండల వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

పెదపాడు : వీఆర్వోల సమస్యలపై సభ్యులు స్పందించాల్సిన అవసరముందని జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రామానుజం శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. పెదపాడు గ్రామ రెవెన్యూ అధికారి కార్యాలయం వద్ద మండలంలోని వీఆర్వోలతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వోలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో మందుండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, కె నటరాజన్‌దాసు, జి ప్రభాకరరావు, బీ. కోటేశ్వరరావు, అల్లు ప్రసాద్, మురళీకృష్ణ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో నేటి నుంచి ఆధార్ శిబిరాలు

పెదపాడు : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 వయస్సు గల చిన్నారుల ఆధార్ నమోదుకు 9 రోజులపాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎండీ అమీలు జమా తెలిపారు. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజులు, 24 నుంచి 28వ తేదీ వరకు ఐదు రోజులు ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తముప్పర్రు, కలపర్రులో 18,19వ తేదీల్లో పెదపాడు, కొక్కిరపాడులో 20, 21 తేదీల్లో అప్పనవీడు, వట్లూరులో 24 నుంచి 25 వరకు, తోటగూడెం 27, వసంతవాడలో 28న, ఏపూరులో 27, 28 తేదీల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామల కార్యదర్శులను ఆదేశించారు. ప్రజలు ఈ ఆధార్ మొబైల్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

రైతులు విశిష్ట సంఖ్యను పొందాలి



రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న ఏడీ సుబ్బారావు

దెందులూరు: రైతులందరూ విశిష్ట సంఖ్యను విధిగా పొందాలని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. సోమవారం ఆయన సోమవరప్పాడు రైతు సేవ కేంద్రం వద్ద రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విధిగా రైతు విశిష్ట నంబరును పొందాలన్నారు. విశిష్ట సంఖ్య నమోదు కోసం రైతు సేవ కేంద్రాలు, వ్యవసాయ శాఖ సహాయకులను కలవాలన్నారు. వారి వద్దకు వెళ్లేటప్పుడు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ , పంట వివరం తెలిపే పట్టాదారు పాస్ పుస్తకం సమాచారాన్ని వారికి ఇవ్వాలన్నారు. రైతులకు విశిష్ట సంఖ్య కేటాయించిన అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, రాయితీలు నేరుగా వారి ఫోన్ నంబరు లింక్ చేసిన బ్యాంకు ఖాతాకు జమ చేస్తారని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు విశిష్ట సంఖ్యపై సేవలు అందిస్తున్నారని ఈ సౌకర్యాన్ని రైతులు వినియోగించుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు కోరారు.

దరఖాస్తుదారులందరికీ జాబ్ కార్డులు

దెందులూరు: మండలంలోని జాతీయ ఉపాధి పథకం కూలీలకు ఏడు లక్షల పని దినాలు కల్పించినట్లు దెందులూరు మండలం ఏపీవో దశరధి రాంజీ అన్నారు. సోమవారం దెందులూరు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు ఇస్తామన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీ పరిధిలో నమోదైన ఉపాధి కూలీలకు పని కల్పించాలని తెలిపారు. మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి కూలీల జీవన విధానాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. కండ్రిక నర్సాపురంలో ఇటీవల మృతి చెందిన ఉపాధి కూలి జయమ్మ కుటుంబానికి ఉన్నతాధికారుల సూచన మేరకు న్యాయం చేస్తామని ఏపీఓ అన్నారు. మృతురాలు కుటుంబం నుంచి అన్ని ధ్రువీకరణ పత్రాలు అందిన వెంటనే జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌కి నివేదిక అందజేస్తామన్నారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రూ.50 వేలు మృతురాల కుటుంబానికి చెక్కు రూపంలో మంజూరు చేస్తారని వివరించారు.

పాఠశాలకు దాతల సాయం అభినందనీయం

ఉంగుటూరు: పాఠశాలలకు దాతలు సాయం అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు. కొత్తగూడెం, నాచుగుంట పాఠశాలకు దాత దాసరి కృష్ణకుమారి ఎలక్ట్రికల్ బెల్ పరికరాలను పరికరాలను అందజేశారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం కోమ్మోజు వెంకటేశ్వరరావుకు రూ.4వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ బెల్ పరికరాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా దాత కృష్ణకుమారికి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాల తల్లిదండ్రులు, యాజమాన్య కమిటీ చైర్మన్ కోమటి దేవి, సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

ఉంగుటూరు: గ్రామ రెవెన్యూ అధికారులతో తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాద్ సమీక్ష సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇళ్ల స్థలాలు మంజూరుకు సంబంధించి అర్హుల గుర్తింపు, యాప్‌లో నమోదు, వ్యవసాయ శాఖకు సంబంధించి ఈ-కేవైసీ జాబితా పరిశీలన, ఆమోదం, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ స్లిప్‌ల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించి, పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలం పరిధిలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

వీరేంద్రప్రసాద్‌కు ఘన నివాళులు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాగంటి వీరేంద్ర ప్రసాద్ (బబ్బు) మృతి పట్ల దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని సంతాపం తెలిపారు. సోమవారం సోమవరప్పాడులోని ఆయన నివాసంలో ఏలూరు మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు), ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తదితరులు బబ్బు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్లుప్తంగా

అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాలు విజయవంతం



సమావేశమైన అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఆశీస్సులతో అందరి సహాయ సహకారాలతో 68వ వార్షిక ఉత్సవాలు విజయవంతమయ్యాయని కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం అమ్మవారి సన్నిధిలో ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు విజయవంతమైనందుకు సహాయ సహకారాలు అందించిన పోలీసు, వైద్య, విద్యుత్ ఉద్యోగులకు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అమ్మవారి ఆలయ ఆవరణలో దుకాణాలు ఏర్పాటుచేసిన వ్యాపారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

8 మంది జూదరుల అరెస్టు

గణపవరం: స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గణపవరం పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు మహిళా ఏఎస్సై ఎం.వరలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు పేకాట శిబిరం నిర్వహిస్తున్న ఇంటిపై సోమవారం దాడి చేసి ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.6,850 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేషనల్ కన్వెన్షన్‌లో సత్తా చాటిన దంత వైద్య విద్యార్థులు

పెదవేగి : నేషనల్ డెంటల్ కన్వెన్షన్‌లో వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో సెయింట్ జోసెఫ్ దంత కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ అన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో ప్రోగ్రాం వెల్స్ తెలంగాణలోని నిజామాబాద్‌లో మేఘన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో సెకండ్ నేషనల్ డెంటల్ కన్వెన్షన్ పోటీలు నిర్వహించారని తెలిపారు. త్రోబాల్ , చెస్, మెహందీ విభాగంలో తమ కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి, పురుషుల ఫ్యాషన్ షోలో రెండో బహుమతి, పురుషుల టీత్ అరేంజ్మెంట్‌లో రెండవ బహుమతి, మెరిట్ ఎగ్జామినేషన్‌లో మూడో బహుమతి సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను కరస్పాండెంట్ సెక్రటరీ ఫాదర్ జి మోజెస్, ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్ నల్లయ అభినందించారు

దెందులూరు మండలంలో 2,200 ఎమ్మెల్సీ ఓట్లు

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు దెందులూరు మండలంలో 2,200 మందికి ఓటు హక్కు లభించిందని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ దెందులూరు మండలంలో మూడు పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారని తెలిపారు. దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూతులు, దెందులూరు బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఫిబ్రవరి 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, మండలం వీఆర్వోల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముండూరుకి చెందిన భీమడోలు రాటాలు (45), ఈనెల 10న ఉదయం కూలి పని కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకూ తిరిగి రాలేదని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పోలీసులను ఆశ్రయించినట్లు అతని కుమారుడు భీమడోలు పుల్లారావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలియజేశారు.

వైవీ రావు సేవలు ఆదర్శనీయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వైవీ రావు చేసిన కృషి ఆదర్శనీయమని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు రీజియన్ చైర్మన్ కేవీ రాఘవులు పిలుపునిచ్చారు. వైవీ రావు ద్వితీయ వర్ధంతి సభ స్థానిక ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం కపర్ది భవనంలో యూనియన్ రీజనల్ చైర్మన్ రాఘవులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. వైవీ రావు చిత్రపటానికి ఏపీ జేఏసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ కె.రమేష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.